ప్రేమా, పెళ్ళి, సెక్స్, పిల్లలు, భద్రత, సంపద, పాపులారిటీ, ఇమేజ్, సమాజంలో విశిష్ఠ వ్యక్తిగా గుర్తింపు ఇవన్నీ కావల్సిందే. కానీ వీటన్నింటిని స్వయం కృషితో, స్వశక్తితో సాధించుకున్నావా? కావా? అన్నది నాకు కావాలి. జీవితాన్ని ఎదుర్కొని ఒక మనిషి బ్రతకగలడు. జీవితం నుంచి పారిపోయి ఒక మనిషి బ్రతకగలడు. జీవితం విసిరే సవాళ్ళను ఎదుర్కొని సాగించే యాత్రకు మజిలీ వుంటుంది. పలాయనానికి మజిలీ ఏముంటుంది-- ? నేను మీకర్థంకాను-- ఒక్కొక్కసారి నాకే నేను అర్థంకాను.

నాలో రేగే అనుమానాల్ని, సందేహాల్ని, అస్థిత్వపు ఆరాటాన్ని అణదొక్కుకొని ఎటువేపు నీ పయనం అని అడక్కుండా, కేవలం నన్ను ప్రేమించాడుగదా, నేనూ అతన్ని ప్రేమించానుగదా అని కళ్ళు మూసుకొని నేను వెళ్ళలేను.

మధుకర్ మంచివాడే కావచ్చు-- అందగాడే కావచ్చు-- పరిపూర్ణ ఆరోగ్యంతో శారీరకదృఢత్వాన్ని కలిగి వున్నవాడేకావచ్చు. కాని ఇవేవి నా హృదయాన్ని స్పందింపజేయలేవని అనిపిస్తోంది. ఈక్వల్‌వేవ్ లెంత్- సమానంగా, సమాన స్థాయిలో మా మనస్సులు వైబ్రేట్ కావేమోననే సందేహం.

మధుకర్ మదర్ పొందుతున్న సంతృప్తి నాకు లభిస్తుందా? నేను పొందగలనా? నేను పొందవలసిన సంతృప్తి మధుకర్ స్వశక్తిమీద నిలబడగలిగినప్పుడే నాకు దక్కుతుంది.

మధుకర్ సూపర్ రిచ్ ఫ్యామ్లీకి చెందినవాడు. మధు పుట్టేసరికి తరగని సంపదని వాళ్ళ ఫాదర్ కూడబెట్టారు.

శ్రమ విలువ మధుకి తెలీదు.

కాని వాళ్ళ నాన్నగారికి తెలుసు.

స్వయంకృషితో ఎంతో సంపదని ఒక్క తరంలోనే సంపాదించి సమాజంలోనే విశిష్టమైన వ్యక్తిగా, వ్యాపారవేత్తగా సంపాదన శక్తిగా గుర్తించబడ్డాడు.

అదే విషయాన్ని నలుగురూ ఆశ్చర్యంగా, అభినందనా పూర్వకంగా చెప్పుకుంటుంటే, మధు ఫాదర్ లోలోపల ఆనందిస్తారు- సంతృప్తి చెందుతారు-- తనను తలుచుకొని తనే గర్వపడతారు.

ఆపైన మధు మదర్ పొందే ఆనందం, గర్వం, తృప్తికి వెల కట్టగలరా? నా భర్త రాత్రింబవళ్ళు శ్రమించి పైకొచ్చారు అని తనను తానే అనుకొని మురిసిపోతుంది. ఆ సందర్భంలో అద్భుతమైన ఆనందోద్వేగాన్ని అనుభూతిస్తుంది.

మరది నాకు అక్కర్లేదా?

మధుని పెళ్ళి చేసుకొంటే-- నాకూ అలాంటి గర్వాన్నే సొంతం చేసుకోవాలనిపించదా?

నా భర్త తన తల్లిదండ్రుల చాటున, నేను నా భర్త చాటున మాకు పుట్టే పిల్లలు మరొచాటున, నీడన బ్రతకవలసి రావటం దుర్భరం కాదా?

స్వయంకృషితో కోట్లకు కోట్లు గడించిన వాళ్ళు తమ పిల్లలకు బోల్డంత సంపాదించి పెట్టామని ఆనందిస్తారు-- నలుగురు పొగిడితే లోలోనైనా సంతసిస్తారు.

మరలాంటి అద్భుతమైన ఆనందం, పొగడ్త,గర్వం తమ పిల్లలకు కూడా స్వంత చేసుకోవాలని వాళ్ళకి అనిపించదేం--?! ఈ వాదన మీకు చిత్రంగా అనిపించవచ్చు-- కాని నిశితంగా ఆలోచించగలిగితే అదే ప్రాముఖ్యత ఇవ్వవలసిన జీవితపు నగ్న సత్యంగా కనిపిస్తుంది.

మధుపై నేను చూపించగల ప్రేమలో నిజాయితీ వుండాలి-- చైతన్యం వుండాలి-- నిత్య యౌవనం వుండాలి-- బలమైన పునాది వుండాలి.

ఒక స్త్రీ అసమర్థుడు, దుర్బలుడైన భర్తనికాని, బలహీనమైన తల్లి దండ్రులమీదే ఆధారపడి పేరసైట్‌లాంటి బిడ్డల్ని కాని ఈ సమాజానికి, దేశానికి అందించటం మహాపాపం, నేరం......." ఆమె కంఠంలో అన్ని ఎమోషన్స్ వేటికవే స్పష్టంగా పలికాయి.

మేరీ, సుధారాణి నిజంగానే విస్తుపోయారు.

మహతి ఆలోచనాపరిధిని భావోద్వేగపు పదునుని, అసాధారణమైన నమ్మకాల్ని తలుచుకొని మతి పోగొట్టుకున్నారు.

"నా ఆలోచనా విధానం మీకు నచ్చలేదా? అందులో నిజాయితీ లేదా? కొత్తకోణం మీకు కనిపించలేదా?" మహతి తిరిగి అంది.

అప్పటికి తేరుకున్న సుధారాణి..."నీ కోర్కెలన్నీ ఒక కలగా అనిపిస్తున్నాయి నీ అంత సున్నితంగా, పదునుగా చాలా తక్కువ మంది ఆలోచిస్తారేమో...? అయినా నీ కోర్కె నెరవేరుతుందా? ఏమో కోట్లాది సంపదని ఒదులుకొని మధుకర్ నిన్ను చేరుకుంటాడా? కలలు-- కథలు-- కాకరకాయలు వేరు-- జీవితం వేరు. ఆ జీవితం విసిరే సవాళ్లను-- కోరుకునే సుఖాలు, సౌఖ్యాలు, సంపద వేరు-- మరొక్కసారి ఆలోచించరాదూ--" అంది నెమ్మదిగా.

మహతి మాట్లాడలేదు.

తన అందమైన పలువరస తళుక్కుమనేలా నవ్వింది. "నీవంటే పడిచచ్చే మధుకర్ నీవనుకున్న విధంగా మారకపోగా-- నీమీద పగబట్టి, నిన్ను సొంతం చేసు-కుంటే--?" మేరీ అంది.

"పశుత్వం ప్రేమని చంపేస్తుందే తప్ప-- బ్రతికించలేదు" బేస్ వాయిస్‌లో గంభీరంగా అంది మహతి.

ఆ ఇద్దరూ వెంటనే ఏం మాట్లాడలేకపోయారు.

దట్టమైన పొగమంచు మడికేరీ పర్వతశ్రేణుల నుంచి అదృశ్యమైపోయింది.

రాత్రంతా పొగమంచులో స్నానంచేసినట్లు గెస్ట్‌హౌస్ ముందున్న పూల మొక్కలు, లాన్, ఫ్లవర్ బోర్డర్స్ తొలి సంధ్యకిరణాల వెలుగులో మెరిసిపోతున్నాయి-- ఆరోగ్యంగా, ఉత్సాహంగా చిరుగాలికి తలలూపుతున్నాయి.

అక్కడక్కడా విసిరేసినట్లున్న ఇళ్ళ కప్పుల్లోంచి తొంగిచూసే ఫైర్ ప్లేస్ పొగగొట్టాల్లోంచి తెల్లటి పొగ బయటకు వచ్చి అదృశ్యమైపోతోంది.

జన సంచారం మొదలయింది.

"ఏమిటి మీరింకా బయలు దేరలేదా? విరాజ్‌పేట వెళ్ళాలి-- అక్కడికి దగ్గర్లో వున్న కేరళ బోర్డర్ దాకా వెళ్ళి రావాలని ప్లాన్ చేశారు. త్వరగా బయలు దేరండి" అంటూ ఓ విద్యార్థి దగ్గరగా వేసివున్న వారి గది తలుపుల్ని లోపలకు నెట్టి అన్నాడు.

మేరీ, సుధారాణి లేచారు.

వచ్చిన విద్యార్థి వెళ్ళిపోయాడు. మిగతా వార్ని లేపేందుకు.

"మీరన్నట్లు మధు తన పశుత్వం ద్వారానే నన్ను లొంగదీసుకోవాలనుకున్నా, అతన్ని నేను గెలవనివ్వను. ఆత్మాభిమానంతో, అభిజాత్యంతో, నాకున్న తెలివితేటల పరిధిలో ఓడించి తీరతాను. ఇట్స్ ఏ చాలెంజ్-- మీ శరీరాలు మీ మనస్సును శాసిస్తాయి. కాని నా విషయంలో నా మనస్సు న శరీరాన్ని శాసిస్తుంది-- " అంటూ మహతి వడివడిగా బాత్‌రూం కేసి సాగిపోయింది.

*                    *                    *                    *

"మోస్ట్ సక్సెస్‌ఫుల్ సింగర్, అందాల సామ్రాజ్ఞి మడోన, వింబుల్డన్ చాంపియన్స్ స్టెఫీగ్రాఫ్, మోనికా సెలస్, పొటెన్షియల్ సినీ ఆర్టిస్ట్స్ మెరిల్ స్ట్రీప్, జేన్‌ఫోండా, బోడెరిక్, లిండా బ్లెయిర్, చివరకు రేఖా, మాధురీదీక్షిత్ లాంటి వాళ్ళు కూడా నీ అపారసంపదను చూసి పరిగెత్తుకొస్తారు.

మహతి మీద నీకున్న ప్రేమ, ఇష్టం, ఆరాధనా వార్ని రప్పించగలదా? లేదు.

అందుకే భాయ్.... మనిషిని బ్రతికించేది, బ్రతికించాల్సించి ప్రేమ కాదు డబ్బు.. ఆరాధన కాదు అపార సంపద. మ్యాడ్‌గా తయారవ్వకు పిచ్చి ప్రేమలో పడి ఎన్ని తరాలు తిన్నా, వృధాచేసినా తరగని సంపదని ఒదులుకోకు మహతి కంటే అందగత్తెలు ఈ ప్రపంచంలో లేరనా నీ ఉద్దేశం.....? ఐ యామ్ సారీ..... అదే నీ ఉద్దేశమైతే, దానితో నేను ఏకీభవించను.. ఆ పైన నీ ఇష్టం" ఓ ఫైవ్‌స్టార్ హోటల్ బార్‌లో కూర్చున్న మధుకర్, అతని ఫ్రెండ్ మూర్తికి మధ్య సంభాషణ నడుస్తోంది.

బార్లో జనం పల్చగా వున్నారు.

బార్ సెంటర్ ఎయిర్ కండిషన్డ్ ద్వారా నియంత్రించిన వాతావరణం చల్లగా, ఆహ్లాదంగా వుంది.

కానీ మధుకర్‌కి మెదడు వేడెక్కిపోతోంది. జేబులో పైసాలేకుండా వచ్చినా అతని ఫ్రెండ్ మూర్తికి ఆ అనుభూతి రెట్టింపు తృప్తిని, ఆనందాన్ని ఇస్తోంది.

"నీకు మరీ అంత కోరికగా వుంటే చెప్పు..... ఆమెను నీ చెంతకు చేర్చే పథకం ఆలోచిస్తాను. ఒంటరి మహతిని అనుభవించు. నీ కళ్ళతో ఆమెలోని ప్రతి అణువును చూడు. ఏమీ మిగలకుండా చూసుకో. అప్పుడు నీకు తెలీని, నీవు చూడని, నువ్వు అనుభవించని అందం, ఆమెలో ఏమీ లేదన్న తృప్తి, గర్వం దక్కుతాయి.

అక్కడికి ఒక ట్రాన్సాక్షన్ ఫినిష్ అవుతుంది. నీ సంపదా నీకు మిగులుతుంది. నీ తల్లిదండ్రుల ప్రేమాభిమానాల్ని ఎప్పటిలాగే మిగుల్చుకోగలవు.

వ్రతం చెడ్డా ఫలితం దక్కుతుంది.

మరో పెగ్ తీసుకో ధైర్యం వస్తుంది.

కోర్కె తీర్చుకో మోజు తీరిపోతుంది.

ఆపైన ఆమెను మర్చిపో, ఆస్థి దక్కుతుంది" మధుకర్ గ్లాస్‌లోకి ఇంపోర్టెడ్ విస్కీ వంపుతూ అన్నాడు మూర్తి.

క్రమంగా నరాల్లో చైతన్యం, ఉత్సాహాన్ని తాత్కాలికంగా నింపే స్కాచ్ విస్కీ మధుకర్‌ని వశపర్చుకుంటోంది.

"చూశావా....... ఈ బార్ వాళ్ళు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో.....?" మూర్తి కావాలనే రెచ్చగొట్టాడు.

అసలే మహతి విషయంలో అవుటాఫ్ మూడ్‌లో వున్న మధుకర్ ఇన్‌స్టెంట్‌గానే రియాక్టు అయ్యాడు.

చెట్టుపై ఉన్న వృద్ధురాలైన గ్రద్ధ  తన పిల్లల్ని రక్షించుకోవటం కోసం అంత:పురానికి వెళ్ళి నగ దొంగతనం చేసి, రాజభటులకు తన గమనం తెలిపేలా చేసి, చెట్టుక్రింద ఉన్న పుట్టలో జారవిడచి, తన శత్రువుకన్నా బలమైన శక్తిని తన శత్రువుకి శత్రువును చేసి తన బిడ్డల్ని కాపాడుతుంది.

అది అనివార్యమైన న్యాయం....

తన అస్థిత్వం కోసం పన్నిన పథకం...

హర్షణీయం అది.

ఇంగితజ్ఞానం, బుద్ధి, మేధస్సు, తెలివితేటలు లేని గ్రద్ధ న్యాయ నిబద్ధతకు లోబడింది. కాని మనిషి.. తనలోని ఈగోని, స్వార్థాన్ని, కుశ్చితాన్ని సంతృప్తిపర్చుకోవటం కోసం ఆ సూత్రాన్నే అమలుపరచి అక్రమ పద్ధతినే జీవన విధానంగా మార్చుకుంటున్నాడు.

ఒకప్పుడు మూర్తి అదే బార్‌కి వచ్చినపుడు జేబుని మర్చిపోయి తాగిన ఫలితంగా తన వాచీని ఆ బార్‌లో తాకట్టుపెట్టి వెళ్ళవలసి వచ్చింది. ఆ కసిని తన బలమైన మిత్రుడ్ని తను శత్రువుగా భావిస్తున్న బార్ యజమానికి శత్రువుని చేసి తన కసిని తీర్చుకొనేందుకు తెలివిగా ఎదుటి వ్యక్తి బలహీనత మీద ఆడుకున్నాడు. తమ బలహీనతల మీద ఆడుకునేందుకు తెలిసి తెలిసి కూడా అవకాశం ఇచ్చే వెర్రి బాగులవాళ్ళు జమిలిగా ఎప్పుడూ తగులుతూనే ఉంటారు ఈ ప్రపంచంలో. నోరులేని జంతువులు తమ ఆకలిని తీర్చుకోవటం కోసం, తమ ప్రాణాల్ని రక్షించుకోవటం కోసం మాత్రమే ప్రయత్నిస్తాయి.

మనిషి స్వార్థానికి, కుటిలత్వానికి, కుచ్చితానికి ప్రతిసారీ ప్రాణం పోసేందుకే ప్రయత్నిస్తాడు.

"ఆఫ్ట్రాల్ ఈ బార్ ఎంత...? వీడి బ్రతుకెంత....? ది గ్రేట్ ఇండస్ట్రియలిస్ట్ రాఘవేంద్రనాయుడిగారి ఏకైక వారసుడ్ని మర్చిపోతే ఫలితం అనుభవిస్తాడు. అరేయ్....ఎవర్రా అక్కడ?" కళ్ళు కోపంతో ఎర్రబడుతుండగా అరిచాడు మధుకర్.

బార్‌లో అటూ, ఇటూ తిరుగుతున్న స్టీవర్డ్స్‌లో మధుకర్ పిలుపు గగుర్పాటుని కలిగించింది.

వెంటనే వడివడిగా వచ్చారు.

"ఏరా.. లెఖ్ఖలేదా.......? ఏం సర్వీసురా ఇది......?" తూలుతూ లేస్తూ ఒక స్టీవర్డ్ చొక్కా పట్టుకొని ప్రశ్నించాడు మధుకర్.

అతను క్షణకాలం బిత్తరపోయాడు.

ఆపైన మూర్తికేసి చూసి విషయాన్ని అర్థం చేసుకున్నాడు.

నీ నిర్వాకమా బాబు అన్నట్లు నిరసనగా చూసాడు.

"యూ నో మై ఫాదర్........?" మధుకర్ తిరిగి అరిచాడు.

తెలీదన్నట్లు ఆ స్టీవర్డ్ తలని అడ్డంగా ఆడించాడు.

అంతలో బార్ మేనేజర్‌కి విషయం తెలిసి నలుగురైదుగుర్ని తీసుకొని అటుకేసి బయలుదేరాడు వేగంగా.

"ఈ బార్ రేటెంత? చెప్పు?" మధుకర్‌కి మత్తు పూర్తిగా తలకెక్కిపోయింది.

"సార్! మీరు అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు" ఆత్మాభిమానం దెబ్బతిన్న స్టీవర్డ్ అన్నాడు ఒకింత బాధగా.

"అమర్యాద... ఏమిట్రా మీకు తెల్సిన మర్యాద? మీ సర్వీస్ ఏమిట్రా? సూట్, బూట్ వేసుకొని ఆంగ్లంలో 'ఎస్ ప్లీజ్' అంటూ అటూ ఇటూ ఊరకే తిరిగే బడుద్ధాయిలు- మీకసలు కస్టమర్ని ఎలా ట్రీట్ చేయాలో తెలుసా?"

చూస్తుండగానే గొడవ పెరిగిపోతోంది.

మూర్తికి చాలా ఆనందంగా ఉంది.

ఇన్ఫీరియారిటీని నరనరాన నింపుకున్న మూర్తి ప్రశాంతత, శాంతి, స్నేహం, ఎదుగుదల అంటే భరించలేడు.

తను ఎదగడు- ఎదిగేందుకు ప్రయత్నించడు. ఎదిగే వాళ్లను చూస్తే మనశ్శాంతిగా ఉండలేడు.

"రాఘువేంద్ర నాయుడుగారు తెలుసా? ది గ్రేట్ ఇండస్ట్రియల్ ఎంపరర్. ఆయన మా ఫాదర్. మేం ఒకసారి సరదాగా పార్టీ ఇచ్చినంత కూడా ఉండదు. ఈ, మీ, బోడిబార్" మధుకర్ నోటివెంట మాటలు ముద్దగా వస్తున్నాయి.

అంతలో మేనేజర్ అక్కడికి వచ్చాడు చస్తూ బ్రతుకుతూ.

"ఏమయింది సార్.... ఏదైనా అసౌకర్యం?" మేనేజర్ ఎయిర్ ఇండియా మహరాజులా వినయంగా తలని ఒకింత వంచుతూ అడిగాడు.

" ఏమయిందా? ఏమీ కావటం లేదిక్కడ? బార్ని మెయిన్టైన్ చేసే విధానమా ఇది? నీట్గా యూనిఫాం వేసుకొని, గుసగుసలాడుకుంటూ, ఆంగ్లదొరల్లా ఫోజుకొడుతున్నారే తప్ప కస్టమర్స్ని పట్టించుకుంటున్నారా? అడిగింది సప్లై చేస్తున్నారా? అలా అని మీ మేనేజ్మెంట్ అబ్జర్వ్ చేస్తుందా? సైకలాజికల్ ట్రీట్మెంట్ అండ్ సాటిస్ఫేక్షన్ ఈజ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ అదర్ థింగ్స్. ఒకసారి బార్కి వచ్చిన- వాడు మరోసారి వచ్చేలా చేసుకోవాలి.

మానసికమైన తృప్తి చాలా అవసరం. ఏదో వచ్చారు, మందు సప్లైచేశాం, డబ్బిచ్చివెళ్ళారు. ఇంతేనా బిజినెస్ అంటే? యునో జపనీస్జ స్టయిల్ ఆఫ్

బిజినెస్..? యూ డోంట్‌నో.... గల్లాపెట్టె దగ్గర కూర్చుని డబ్బులు లెక్కేసుకోవటం, వాటిని పొందికగా పేర్చుకొని, రబ్బర్‌బ్యాండ్స్ వేసుకోవటం, స్టుపిడ్ ఫెలోస్.

హోమ్లీ ట్రీట్‌మెంట్. యూ నో హోమ్లీ ట్రీట్‌మెంట్?? ఆ ? చెప్పు...." బిట్టర్‌గా అన్నాడు మధుకర్.

బిజినెస్ గురించి బాగా తెల్సినవాడితను అని బార్ స్టాఫ్ మధుకర్ గురించి అనుకుంటే, తనకు తెలీకుండానే అంతర్లీనంగా తన తండ్రీ రాఘవేంద్ర నాయుడు వ్యాపార సూత్రాల్ని జీర్ణించుకున్నాడా మధుకర్ అని మూర్తి ఆశ్చర్యపోయాడు.

పులిబిడ్డ పులిబిడ్డే..... బిజినెస్‌మెన్ కొడుకు బిజినెస్‌మెన్నే--!!

"అసలు మీ బోడి బార్ రేటంత--?" అంతకంతకు రెచ్చిపోతున్నాడు మధుకర్.

ఇక్కడిలా వుండగా కౌంటర్‌లో వున్న ఫోన్ రింగయింది. అది తెలిసిన మేనేజర్ ఇప్పుడే వస్తానంటూ అటుకేసి పరుగెత్తి కెళ్ళి ఫోన్‌ఎత్తాడు.

"హలో-- మధువన్ బార్ అండ్ రెస్టారెంట్ ప్లీజ్"అన్నాడు మేనేజర్ టెన్షన్ పడిపోతూ.

"నేను.... మహతిని.. మడికేరీ నుంచి మాట్లాడుతున్నాను. నాన్న గారున్నారా?" ఫోన్‌కి అటువైపునుంచి మహతి ప్రశ్నించింది.

"లేరమ్మా... ఇంకా రాలేదు........!!" అన్నాడు మేనేజర్ హడావుడి పడిపోతూ.

"ఏమిటి మీ వాయిస్ అలా వుంది? ఆందోళన, ఉద్రిక్తత తొంగి చూస్తోంది ఎనీ థింగ్ రాంగ్....?" మహతి ఫోన్‌కి అటువైపు నుంచి తిరిగి ప్రశ్నించింది.
మేనేజర్ నాలిక్కరుచుకున్నాడు.

ఆమె సంగతి మేనేజర్‌కి తెలుసు.